క్లుప్తంగా

టీ-సేవ్ లోగో ఆవిష్కరణ



నడికూడ : నిరుద్యోగులు, విద్యార్థుల కోసం వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల ఏర్పాటు చేసిన టీ–సేవ్ లోగోను ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ అముదాల మల్లేశం మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జలుగురి రమేష్, కృష్ణ స్వామి, చుక్క రవి, సాంబయ్య, రాజు, సదయ్య, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

16న 'మోడల్' ప్రవేశ పరీక్ష

కమలాపూర్ : తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో వంద సీట్లతోపాటు 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 16న (ఆదివారం) ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అనిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అలాగే 7, 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు హాల్ టికెట్లను మీసేవా కేంద్రాల్లో లేదా వెబ్‌సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవాలని, పరీక్ష సమయానికి అరగంట ముందే పరీక్షా కేంద్రానికి హాల్ టికెట్లతో హాజరు కావాలని సూచించారు.

నియామకం

పరకాల : బీజేపీ మండల కార్యదర్శిగా ముస్కె దేవేందర్‌ను, దళిత మోర్చా మండల ప్రధాన కార్యదర్శిగా మంగలపల్లి బాబు ను నియమించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పుట్ట రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ బలోపేతానికి చురుకైన పాత్ర పోషిస్తున్న క్రమంలోనే వారికి పదవులు కట్టబెట్టినట్లు పేర్కొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఎల్కతుర్తి : మండలంలోని ముత్తారం గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని నేడు (బుధవారం) హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఆవిష్కరిస్తారని సర్పంచ్ రేణికుంట్ల శాంతికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్ కుమార్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



వీరాచారి (ఫైల్)

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వంగళ వీరాచారి (62) గోల్డ్ స్మిత్‌గా పని చేస్తున్నాడు. సోమవారం మోటార్‌సైకిల్‌పై నిజాంపల్లిలో బంధువు దశదినకర్మకు హాజరై తిరిగి మండల కేంద్రానికి వస్తున్న క్రమంలో నీరుకుళ్ల క్రాస్‌రోడ్ సమీపంలో ఇదే మార్గంలో వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఆయన్ను చికిత్స నిమిత్తం నగరంలోని ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. కాగా వీరాచారి చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రమణాచారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వీరాచారి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

ఇల్లు విడిచి వెళ్లిన మహిళ



పరకాల : తన భార్య స్వర్ణలత మతిస్థిమితం లేక ఈనెల 9న ఇంటి నుంచి వెళ్లిపోయిందని, ఆచూకీ తెలియడం లేదని పేర్కొంటూ నడికూడకు చెందిన దుప్పటి ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలోనూ ఓసారి ఇంట్లోంచి వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని వివరించారు.

నాటుసారా విక్రేత బైండోవర్



ఆత్మకూరు : మండలంలోని అక్కంపేట గ్రామానికి చెందిన రాసమల్ల సాయికిరణ్ నాటుసారా విక్రయిస్తుండడంతో ఆయన్ను తహసీల్దార్ సురేష్‌కుమార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ జగన్నాధం తెలిపారు. బైండోవర్ అయిన సాయికిరణ్ రూ.లక్ష జరిమానా చెల్లించిన క్రమంలో సీఐ జగన్నాదం మాట్లాడారు. నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై పద్మ, సిబ్బంది లక్ష్మణాచారి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయాలను కొనసాగించాలి

మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఇతర నాయకులు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లాలోని పలు మండలాల్లో పూలే జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, ముఖ్య కూడళ్లలో పూలే చిత్రపటాలకు, విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళులర్పించారు.

–సాక్షి నెట్‌వర్క్



పరకాల : పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, తదితరులు



ఎల్కతుర్తిలో..



కమలాపూర్‌లో..



ఐనవోలులో..



దామెరలో..



శాయంపేటలో..



నడికూడలో..

అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ

ధర్మసాగర్ : మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మహనీయుల విగ్రహాల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని, బస్టాండ్ సమీపంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, కళాశాల వద్ద పూలే విగ్రహాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి బొడ్డు ప్రభుదాస్ అధ్యక్షత వహించగా సర్పంచ్ ఎర్రబెల్లి శరత్, ఎంపీటీసీలు రొండి రాజు, జాలిగపు వనమాల, బొడ్డు శోభ, ఉపసర్పంచ్ బొడ్డు అరుణ, కమిటీ సభ్యులు, ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్, పీసీసీ సభ్యుడు గంగారపు అమృతరావు, నాయకులు బొడ్డు వాసుదేవ్, నిమ్మ సుదర్శన్‌రెడ్డి, రావుల వెంకట్‌రెడ్డి, గుర్రపు ప్రసాద్, బొడ్డు లెనిన్, పుట్ట నవీన్, చిలుక రవీందర్, గంగారపు శ్రీనివాస్, కూనూరు రాజు, కొలిపాక రమేష్, బొడ్డు సోమయ్య, బొడ్డు ఇమాన్, బొడ్డు సుశీల్ కుమార్, మాచర్ల రవీందర్, నాగబెల్లి యుగేందర్, బొడ్డు భరత్, బొడ్డు కరియప్ప, బొడ్డు ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్, తదితరులు

ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

శాయంపేట : మండల కేంద్రంలోని దళిత కాలనీలో రూ.25 లక్షలతో చేపట్టిన ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు ఎట్టకేలకు మంగళవారం ప్రారంభమయ్యాయి. 'ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయ్యేదెన్నడో' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించారు.

పైప్‌లైన్ పనులు..



శాయంపేట : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్ కూడలి వరకు చేపట్టిన మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్ మంగళవారం ప్రారంభించారు. గతంలో రోడ్డు విస్తరణ పనుల్లో భగీరథ పైప్‌లైన్లు ధ్వంసం కావడంతో కాలనీవాసులు సీఈ, డీఈ, ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆపరేటర్ ప్రభాకర్, జీపీ పంపు ఆపరేటర్ బత్తు రమేష్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌తో ప్రయోజనం శూన్యం'

ఐనవోలు : బీఆర్‌ఎస్ పార్టీ వల్ల ప్రజలకు కలిగిన ప్రయోజనం శూన్యమని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి బండి సుధాకర్ గౌడ్ తెలిపారు. మండలంలోని పంథిని గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలప్పుడు ఆచరణ సాధ్యం కాని అనేక హామీలు గుప్పించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి ప్రజాకాంక్షను నీరుగారుస్తున్నారని విమర్శించారు. అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడ్డ తెలంగాణ ఆత్మగౌరవాన్ని సీఎం కేసీఆర్ ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ సంపదను దోచుకుని కల్వకుంట్ల కుటుంబం ఈడీ కేసులు ఎదుర్కొంటోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతతోనే ప్రశ్నపత్రాల లీకేజీలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకు వంట గ్యాస్, ఏకకాలంలో రూ.2 లక్షల పంట రుణాలు మాఫీ, ఎకరాకు రూ.15 వేల రైతుబంధుతోపాటు వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన అన్ని హామీలనూ నెరవేర్చుతామని స్పష్టం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమ్మెట మహేందర్, కూస చిరంజీవి, సమ్మెట రాజు, గ్యాదరి భాస్కర్, మదూరి మల్లేశం, బండి రమేష్, గుర్రపు నిఖిల్, బండి రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండి సుధాకర్ గౌడ్

అంబేడ్కర్ రత్న అవార్డు



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మహమ్మద్ మున్నాకు సహారా చారిట్రబుల్ ట్రస్ట్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రత్న అవార్డు అందజేసింది. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి ఈ అవార్డును అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణావ్యాప్తంగా దివ్యాంగులు, వృద్ధులు, అనాథ, పేద పిల్లలకు సేవలు అందిస్తున్న సామాజిక సేవా కార్యకర్తగా గుర్తింపు పొందిన మహమ్మద్ మున్నాను అవార్డుకు నిర్వాహకుడు డాక్టర్ అక్లాక్ అహ్మద్ ఎంపిక చేసి మెయిల్ ద్వారా ప్రశంసా పత్రాన్ని పంపించారు.

నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయండి

ఆత్మకూరు : ఈనెల 15న హనుమకొండలో తలపెట్టిన 'నిరుద్యోగ మార్చ్'ను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. నిరుద్యోగ మార్చ్‌కు నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, ఆర్టీఐ జిల్లా కన్వీనర్ ఎదులాపురం శ్రావణ్‌కుమార్, నాయకులు బయ్య పైడి, గట్టు వేణు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : ఈనెల 15న హనుమకొండలో నిర్వహించనున్న 'నిరుద్యోగ మార్చ్'ను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి కోరారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు ఉప్పు రాజు, శ్రీకాంత్, నరిహరిశెట్టి రామకృష్ణ, ఎర్ర రాకేష్‌రెడ్డి, మేకల సుమన్, చంద్రమౌళి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : మాట్లాడుతున్న కాచం గురుప్రసాద్

ముగిసిన పదో తరగతి పరీక్షలు



ఆత్మకూరు : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ థెరిస్సా హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా మంగళవారం ముగిశాయి. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ కుమార్, ఎస్సైలు ప్రసాద్, అనిల్ బందోబస్తు నిర్వహించారు.

గోవుల సంరక్షణతో రైతులకు లబ్ధి

ధర్మసాగర్ (వేలేరు) : గోవులను సంరక్షిస్తే రైతులకు లబ్ధి చేకూరుతుందని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ ఆగర్వాల్ తెలిపారు. వేలేరు మండలంలోని పీచర గ్రామంలో శ్రీలక్ష్మీ గోశాల ఆధ్వర్యంలో 10 మంది రైతులకు మహేష్ అగర్వాల్ చేతుల మీదుగా 20 కోడెదూడలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేష్ అగర్వాల్ మాట్లాడారు. రైతులు సేంద్రియ వ్యవసాయం చేయాలని సూచించారు. గోవుల పేడ, మూత్రం పంటల సాగులో వినియోగించాలని చెప్పారు. సేంద్రియ విధానంలో పంటలు సాగు చేస్తే అధికమైన దిగుబడులు పొందవచ్చని తెలిపారు. పెస్టిసైడ్స్ వాడకం వల్ల భూసారం దెబ్బతిని భవిష్యత్ తరాలకు నష్టం కలిగే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాడిపల్లి రాజేశ్వర్‌రావు, సూపరింటెండెంట్ దుర్గం రోజ, జాడి పవన్‌కుమార్, ఎంపీటీసీ జల్దార్ సంపత్, గోశాల ప్రతినిధులు రామంచ సుధాకర్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



దూడలను పంపిణీ చేస్తున్న మహేష్, తదితరులు

ఘనంగా ఎల్లమ్మతల్లి పండుగ

కాజీపేట రూరల్: కాజీపేట 48వ డివిజన్ దర్గా పవన్‌నగర్‌లో మంగళవారం ఎల్లమ్మతల్లి పండుగను ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మతల్లి ఆలయానికి భక్తులు, నాయకులు తరలివచ్చి పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. బీజేపీ మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం మాట్లాడుతూ.. ప్రతి 5 సంవత్సరాలకోసారి ఎల్లమ్మతల్లి పండుగ ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది 15వ సంవత్సరం ఎల్లమ్మ తల్లీ పండుగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నార్లగిరి రామలింగం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ మేయర్ డాక్టర్ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ పరిశీలన



హెల్త్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

ఎల్కతుర్తి : మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు మంగళవారం పరిశీలించారు. ఆ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ క్యాంప్ నిర్వహణపై వైద్యులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహిళలకు క్యాంప్‌లో బీపీ, షుగర్, యూరిన్, పీరియడ్స్, తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. క్రిటికల్‌గా ఉన్న స్త్రీలను ఐఎస్ సెంటర్‌కు రెఫర్ చేసినట్లు వైద్యాధికారిణి శోభారాణి తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యాకూబ్‌పాషా, తదితరులున్నారు.

పేదలను ఆదుకునేలా సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

శాయంపేట : పేదలను ఆదుకునేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి తెలిపారు. మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన అనిగాల శ్రీకాంత్, కొత్తగట్టు సాంబయ్యలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మధుసూదనాచారి మంగళవారం అందజేసి మాట్లాడారు. గత పాలకులు పేదలను విస్మరించారని విమర్శించారు. స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఎన్నికల ఎజెండాలో లేని పథకాలను సైతం అమల్లోకి తెచ్చారని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు ఎవరూ అడగకపోయినా పేద కుటుంబాలను ఆదుకునేలా కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, తదితర పథకాలు రూపొందించి సమర్థవంతంగా అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీతోపాటు గత పాలకులు ఎవరు కూడా ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను సైతం అమలు చేసిన దాఖలాల్లేవని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ మాత్రమే ఎన్నికల ఎజెండాలో అంశాలే కాకుండా పేదల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలు చేపట్టి వేల కోట్ల రూపాయలు అందిస్తూ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలు తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన నాయకులు కొత్తగట్టు సాయికృష్ణ, బెరుగు రాకేష్, రాజు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలే బలగం

● ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ధర్మారెడ్డి

పరకాల : బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే పెద్ద బలగమని స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో స్థానిక మున్సిపాల్టీ పరిధిలోని 22 వార్డుల పార్టీ ముఖ్యనాయకులతో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి కాలం చెల్లిపోయిందన్నారు. బీజేపీకి బుద్ధి చెప్పేలా కార్యకర్తలు సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్షాలకు బీఆర్‌ఎస్ సత్తా చూపించేలా సమన్వయంతో, సమిష్టిగా కృషి చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ పేదలను దోచి పెద్దలకు పెడుతోందని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, దళిత బంధు కమిటీ కన్వీనర్ సోదా రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు గంటా కళావతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయం



ఎల్కతుర్తి : కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ



శాయంపేటలో..

ఎల్కతుర్తి : అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ మేకల స్వప్న తెలిపారు. మండలంలోని దామెర గ్రామంలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నేత్ర సంబంధిత సమస్యలు పరిష్కరించేలా కంటివెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. 18 ఏళ్లకుపైబడ్డ ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారికి కళ్లద్దాలు ఇస్తారని చెప్పారు. అనంతరం వైద్యులు గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చల్లా రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీలు వేముల రజని, గొర్రె ఆదాం, కడారి భిక్షపతి, సాతూరి చంద్రమౌళి, సాతూరి వెంకన్న, వైద్యాధికారి హిక్తేదార్ హైమద్, సిబ్బంది వర్ష, శ్వేత, జునేది, సూజాత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటివెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి రవీంద్ర, శ్రీనివాస ప్రసాద్, రవీందర్, సుగుణ, దిలీప్, హెల్త్ అసిస్టెంట్ రోజ్‌లీన్, సాంబలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి



ఆత్మకూరు : మాట్లాడుతున్న డీపీఎం దాసు

ఆత్మకూరు : ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉంటేనే అభివృద్ధి చెందగలరని ఐకేపీ డీపీఎం దాస్ స్పష్టం చేశారు. మండలంలోని కొత్తగట్టు గ్రామంలో అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్‌పై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో దాస్ మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో మెళకువలు సాధించాలని సూచించారు. ఇన్సూరెన్స్ గురించి తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేష్, ఏపీఎం లలితదేవి, రాజు, రజని, కల్యాణి, సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

దామెర : మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహనా సదస్సులో డీపీఎం బీఎల్.దాసు మాట్లాడారు. డిజిటల్ పేమెంట్, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. నగదు రహిత లావాదేల వలన సమయం ఆదా అవుతుందన్నారు. బ్యాంక్ అక్కౌంట్ వివరాలు, ఓటీపీ, పిన్ నంబర్ ఇతరులతో పంచుకోకూడదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జీవిత బీమా పాలసీలను వివరించారు. సమావేశంలో ఎంపీపీ కాగితాల శంకర్, జెడ్పీటీసీ గరిగె కల్పన, దళిత బంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, ఏపీఎం రాజు, ఝాన్సీ, బ్యాంకు మిత్ర రాధిక, తదితరులు పాల్గొన్నారు.

'అక్రమంగా కలప తరలింపు'



ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలోని కోమటికుంట చెరువు నుంచి అక్రమంగా కలప తరలిస్తున్నట్లు బీజేపీ నాయకులు దండు కిషన్, అలువాల మహేందర్, పొన్నం రాజు, కాటబోయిన కృష్ణ, రమేష్, గాండ్ల సుమన్ ఆరోపించారు. ట్రాక్టర్ల ద్వారా కలప తీసుకెళ్తుండగా మంగళవారం వారు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా కిషన్, మహేందర్, రాజు, కృష్ణ, రమేష్, సుమన్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హరితహారం ద్వారా మొక్కల పెంపకాన్ని చేపడుతుండగా గ్రామంలో చెట్లు నరకడం సరికాదన్నారు. కాగా గ్రామ పంచాయతీ తీర్మాణం మేరకు ఎండిపోయిన చెట్లను విక్రయించినట్లు సర్పంచ్ కంజర్ల రమేష్ తెలిపారు.